క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న పోలీసులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో మంగళవారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. మండలంలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ఎస్సై రవి ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు.

యూత్ కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

జమ్మికుంట: పట్టణంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మంగళవారం యూత్ కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీకి యూత్ కాంగ్రెస్ సేవలు కీలకమని, ఏఐసీసీ నుంచి మండల కమిటీ వరకు పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. అనంతరం ప్రణవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్, జిల్లా కమిటీ, బ్లాక్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో పట్టణ అధ్యక్షుడు రమేష్, మాజీ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య అధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందిస్తున్న కార్మికులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కరించడం లేదని సీఐటీయూ ఆధ్వర్యంలో 19వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు ఎంపీడీవో భీమేశ్ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం నోటీస్ అందజేశారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు రాష్ట్ర నాయకత్వం పలుమార్లు వినతి పత్రాలు అందజేసిన దృష్టి సారించడం లేదన్నారు. పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండిగ రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి లద్దునూరి కుమార్, కోశాధికారి మ్యకమల్ల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు అసాల సారయ్య, తిరుపతి, రాజకోమురయ్య,మొగిలి, సంపత్, సదానందం, రమేష్, రవి, స్వామితోపాటు కార్మికులు పాల్గొన్నారు.

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి

జమ్మికుంట: దళిత బంధు నిధులు విడుదల చేయాలని మంగళవారం దళిత సంఘం నాయకుడు పర్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో పలువురు ఎంపీడీవో భీమేష్‌ను మంగళవారం కలిశారు. రెండో విడుత దళితబంధు నిధులు లబ్ధిదారులకు విడుదల చేయాలని చెప్పినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రభుత్వం, ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకపోవాలని కోరారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థ ఎన్నికలు త్వరలో రానున్నాయని, జాప్యం చేస్తే ఎన్నికల కోడ్‌తో నిధులు విడుదల కావని, చొరవతీసుకొని లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

విజయవంతం చేయాలి

మానకొండూర్: ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. రాష్ట్రం కోసం ఏర్పడిన బీఆర్ఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, పదవులను త్యాగం చేసి తెలంగాణ తెచ్చుకున్నమన్నారు. భారీ బహిరంగకు నియోజకవర్గం నుంచి 12 వేల మంది రావడానికి సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఒక రోజు ముందే సభకు బయలుదేరుతారని, కాంగ్రెస్ సభను అడ్డుకోవాలని చూస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడమన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సిద్దం వేణు, శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు మహిపాల్, వెంకన్న, రవి, దేవ సతీశ్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, రామంచ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం చొప్పదండి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ విజయవంతం చేయడానికి ఏర్పాటు చేస్తున్న సన్నాహక సమావేశానికి మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

ఏర్పాటు ఘనం.. నిర్వహణ అధ్వానం



శంకరపట్నం: ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు కేశవపట్నం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం మూతపడటంతో ప్రయాణికులు దాహంతో అల్లాడి పోతున్నారు. ఈ నెల 2న కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఆరు రోజులు రంజన్లలో తాగునీరు పోశారు. మంగళవారం ప్రయాణికులు చలివేంద్రం వద్దకు వెళ్లి తాగునీరు లేక వెనుతిరిగారు. నాలుగు రోజులకు ఆర్భాటంగా ఏర్పాటు చేశారని, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. చేసేదిలేక ప్రయాణికులు దుకాణాల్లోని మంచినీటి బాటిళ్లు కొనుక్కొని వెళ్తున్నారు.

తల్లిదండ్రులకు ఆటల పోటీలు



హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించామని హెచ్ఎం అనురాధ తెలిపారు. వివిధ రకాల ఆటల పోటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారని, గెలుపొందినవారికి ఈ నెల 28న బహుమతుల ప్రదానం చేస్తామన్నారు.

తాగునీటి ఇబ్బందులు తొలగినట్టే



రక్షిత మంచినీటి బావిలోకి నీటి సరఫరా

సాక్షి స్పందన

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేటలో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. ఓ వ్యవసాయబావిని అద్దెకు తీసుకుని వేసవిలో తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 7వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'ఏటా ఇబ్బందులు... ఎవరూ పట్టించుకోరు' అనే కథనానికి అధికారుల స్పందించారు. గ్రామానికి చెందిన ఠాకూర్ దిలీప్‌సింగ్ వ్యవసాయబావిని మూడు నెలలకు అద్దెకు తీసుకున్నారు. మంగళవారం అద్దె బావి నుంచి రక్షిత మంచినీటి బావి వరకు నీటిని తరలించారు. అక్కడి నుంచి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు తరలించి గ్రామస్తులకు నిరంతరం తాగునీరు సరఫరా చేస్తామని గ్రామ ప్రత్యేకాధికారి రాజులు నాయుడు, కార్యదర్శి సంపత్ తెలిపారు. తాగునీటి ఇబ్బందుల నుంచి రక్షించిన అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరు

నవాబుపేట గ్రామానికి పైపులైన్ కోసం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్‌డీఎఫ్ కింద రూ.20 లక్షలు మంజూరు చేశారని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, గ్రామ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌సింగ్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు మంజూరు ఉత్తర్వుల కాపీ అందించారు. గ్రామస్తుల తాగునీటి ఇబ్బందుల విషయం మంత్రి దృష్టికి వచ్చిందని, మోయతుమ్మెదవాగులో రూ.15 లక్షలతో తవ్విన రక్షిత మంచినీటి బావి పైపులైన్ లేక నిరుపయోగంగా ఉంటున్నందున పైపులైన్ వేస్తే శాశ్వత పరిష్కారమవుతుందని భావించిన మంత్రి తక్షణం నిధులు మంజూరు చేశారని, చిగురుమామిడిలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మరో రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని, ఎస్టిమేట్ వేసి పనులు ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

జంతు సంరక్షణ బాధ్యతగా గుర్తించాలి



బహుమతులందిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

రామడుగు: జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి వాటిని కాపాడుకొవాల్సిన అవసరం ఉందని మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్తుపాఠశాలలో మంగళవారం జంతు సంరక్షణ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు జంతువుల పట్ల పశుసంవర్ధక శాఖ వారి ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, జంతువులను హింసించిన, బాధలకు గురిచేసినప్పటికి వాటికి ప్రత్యేకంగా చట్టాలు ఉన్నాయని వాటి వల్ల శిక్షలు కూడా పడడం జరుగుతుందన్నారు. మనుష్యులకు ఉన్నట్లుగానే జంతువులకు హక్కులు ఉన్నాయన్నారు. కాగా కుక్కలు కరిచినట్లయితే తీసుకొవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించారు. విద్యార్థులకు జంతువుల సంరక్షణపైన వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండి ఉప వైద్యశాల లైవ్ స్టాక్ ఆఫీసర్ గిరిధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు సంపదపై వ్యాసరచన పోటీలు



బహుమతులందిస్తున్న రామకృష్ణ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశు సంపదపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటరాంరెడ్డి, శ్రీనివాస్, రాజియొద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

కుక్కకాటును నిర్లక్ష్యం చేయొద్దు



అవగాహన కల్పిస్తున్న సురేందర్‌రెడ్డి

గన్నేరువరం: కుక్కకాటు నిర్లక్ష్యం చేయొద్దని వెంటనే వైద్యుడిని సంప్రదించి టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి సురేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జిల్లా లో పశువైద్య సంక్షేమశాఖ ఆద్వర్యంలో రేబీస్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి రామయ్య, హెచ్ఎం సాయిశిరిష, వైద్యాధికారి సాంబరావు, పశువైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న



ఇల్లందకుంట: మండలంలో సోమవారం రాత్రి వీచిన బలమైన ఈదురు గాలులకు పలు గ్రామాల్లోని మొక్కజొన్న నెలకొరిగింది. శ్రీరాములపల్లి, మల్యాల, గడ్డివానిపల్లి, భోగంపాడు, పాతర్లపల్లి, చిన్నకోమటిపల్లి తదితర గ్రామాల్లో పీచు దశలోని పంట కిందపడడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 150 ఎకరాలకు పైగా పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులకు నేలమట్టంకావడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. సంబంధిత అధికారులు పంటను పరిశీలించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

వంటగ్యాస్ ధర పెంపుపై సీపీఐ ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

శంకరపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ ధర సిలిండర్‌కు రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ మండలంలోని కేశవపట్నంలో సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. సామాన్యులపై భారం పడుతుందని, గ్యాస్ ధరను తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, భిక్షపతి, మొగిళి, కుమార్, పోచయ్య, సత్తయ్య, కిషోర్, రవి, మురళి, నగేశ్, సుకుమార్, షాకీర్‌లు పాల్గొన్నారు.

దేశరాజ్‌పల్లిలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లిలో మంగళవారం రేకుర్తి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కరీంనగర్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 150 మందికి పరీక్షలు చేశారు. అవసరమున్న వారికి ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ కొండా వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదురు సురేష్, లయన్ చెన్నమనేని సుధీర్‌రావు, మాజీ సర్పంచ్ కోల రమేష్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డిలతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలకేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం రాష్ట్రీయ బాల సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరేళ్లలోపు పిల్లలకు కంటి, మానసిక రుగ్మతలు, ఎదుగుదల లోపాలను గుర్తించడానికి ప్రత్యేక పరీక్షలు చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిద్ అధరీ సందర్శించి పౌష్టికాహారం, పరిశుభ్రత, ప్రభుత్వ ఆరోగ్య సేవలు వివరించారు. ఆర్‌బీఎస్‌కె మెడికల్ ఆఫీసర్ హబీమొద్దీన్, సంపత్, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, ఆశావర్కర్ మంజుల, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత



స్కూల్ బ్యాగులు అందిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో



మానకొండూర్‌లో...

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్, చిగురుమామిడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అధికారులు స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్స్‌ను అందించారు. పౌల్ట్రీఫాం, ఇటుక బట్టీల్లో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీల పిల్లలకు కలెక్టర్ ఆదేశాల మేరకు బ్యాగులు, స్టడీమెటీరియల్స్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం రమేశ్, ఎంపీడీఓ మధుసూదన్, ఎంఈవో పావని, జెడ్పీపాఠశాల హెచ్ఎం రబియాబస్రీ , శోభారాణి, సుజాత, శారద, సీఆర్పీలు ఆంజనేయులు, శ్రీవాణి పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రవాస భారతీయుల సెనిస్టినా మిత్రబృందం మంగళవారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఉపాధ్యాయుల సూచనలకు అనుగుణంగా చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేతిరి జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, శైలజ, రక్సానా , అస్మాబేగం పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయంలో 14న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, కోలపురి శ్రీకాంత్, దుంపల మోహన్, వెల్మ బాపు రెడ్డి, గద్దె తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● నేడు సర్వసభ్య సమావేశం

వీణవంక: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈవో ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

● నేటి నుంచి ఎస్ఏ–2 పరీక్షలు

హుజూరాబాద్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో బుధవారం నుంచి ఎస్ఏ–2 పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఈవో భూపతి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పరీక్షలు ఈ నెల 17వ తేదీతో ముగుస్తాయని, నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

● పారిశుధ్య కార్యక్రమంపై అవగాహన

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధ్యాయులతో పారిశుధ్య కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. 19న పట్టణంలో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమంపై అవగాహన పెంచేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి వివిధ ప్రదర్శనలు చేయాలని కోరారు. అనంతరం ఎంఈవో భూపతి శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మొదటిసారిగా హుజూరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

● రోడ్డు మరమ్మతు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ, రాగంపేట గ్రామాల మధ్య రోడ్డు ధ్వంసంకావడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ మంగళవారం దగ్గరుండి రోడ్డు మరమ్మతు చేయించారు. సుమారు పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో విషయం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి వెళ్లింది. ఆయన ఆదేశాలతో ఏఎంసీ చైర్మన్ సొంత ఖర్చులతో రోడ్డుపై గుంతలను పూడ్చి చదను చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు, ఏఎంసీ చైర్మన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఇల్లందకుంట: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్.నరసింహరాజు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం క్రియాశీల సభ్యులతో సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

● అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాలలో మంగళవారం అంబేడ్కర్ సంఘం నాయకులు సమావేశమై అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా దోమకొండ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా సముద్రాల శివరామకృష్ణ, లంకదాసరి చాణక్య, ప్రధాన కార్యదర్శిగా దోమకొండ తిరుపతి, కార్యదర్శిగా నరేశ్, సంయుక్త కార్యదర్శిగా బోయిని ఆంజనేయులు, కోశాధికారిగా లంకదాసరి తిరుపతి ఎన్నికయ్యారు. ఆర్గనైజర్లుగా అరవిందు, శ్రీకాంత్, తిరుమల్, అజయ్‌ని నియమించారు.

● దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్: రేషన్ డీలర్ నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. మండలంలోని అన్నారం, ఖాదర్‌గూడెం , గంగిపల్లి, పచ్చునూర్, శంషాబాద్, పెద్దూర్‌పల్లి, నిజాయితీగూడెం గ్రామాల రేషన్ డీలర్ పోస్టులకు ఖాళీలు ఏర్పాడ్డాయని, ఆసక్తి గలవారు ఈ నెల 12 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● ఇరిగేషన్ ఈఈకి ఫిర్యాదు

హుజూరాబాద్: పట్టణ శివారులోని చిలుకవాగుతో పాటు పలు కుంటలు, చెరువుల భూములను కబ్జా చేశారని, వాటికి హద్దులు ఏర్పరచాలని కోరుతూ మంగళవారం కేసీ క్యాంపులోని నీటి పారుదలశాఖ ఈఈ శశిభూషణ్‌కు ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య మంగళవారం ఫిర్యాదు చేశారు. హద్దులు లేకపోవడంతో కొంత మంది ఇష్టానుసారంగా కబ్జాకు పాల్పడుతున్నారని దీనిపై విచారణ జరపాలని కోరారు.

● కేసు నమోదు

జమ్మికుంట: అజాగ్రత్తగా కారు నడిపి ఇద్దరికి తీవ్ర గాయాలు చేసిన ఓ వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు.

● ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్: మండలంలోని పెద్ద పాపయ్య పల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని పాకాల సంజన మ్యాథ్స్ ఒలంపియాడ్ లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి సిల్వర్ మెడల్ సాధించింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంది.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదువుతున్న ఎస్. సుష్మిత మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో జిల్లా స్థాయిలో 10, జాతీయ స్థాయిలో 387 ర్యాంక్ సాధించినట్లు హెచ్ఎం నీరజ తెలిపారు.

వీణవంక: మండలంలోని ఎల్బాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి పులిపాక జోసెఫ్ జిల్లా స్థాయి సైన్స్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చాడు. 8వ తరగతి చదువుతున్న జోసెఫ్ ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఒలంపియాడ్‌లో నాలుగో స్థానంలో నిలిచాడు.

● రాజ్యాంగ పరిరక్షణకు కలిసిరావాలి

ఇల్లందకుంట: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కలిసిరావాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు అన్నారు. మంగళవారం జై బాపు, జైభీమ్, జై సంవిదాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ పదయాత్ర మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీరాములపల్లి గ్రామం నుంచి ఇల్లందకుంట వరకు నిర్వహించారు.

మానకొండూర్ మండలంలో..

మానకొండూర్: చరిత్రను ఎవ్వరూ తుడిచెయ్యలేరని, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి అన్నారు. మండలంలోని శంషాబాద్, గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, నిజాయితీగూడెం, పెద్దూర్‌పల్లి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విధానాలపై బీజేపీ అవలంబిస్తున్న కుట్రలకు బుద్ధి చెప్పాలన్నారు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం



మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ పూరి గుడిసె దగ్ధమైంది. ఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. గ్రామంలోని ఒడ్డెరకాలనీలో గొల్లన అశోక్, జ్యోతి దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి పూరిగుడిసెలో నివసిస్తున్నారు. అశోక్ కూలీ పనికి వెళ్లగా, జ్యోతి దేవుడికి దీపం వెలిగించి సీడ్ కంపెనీలో పనికి వెళ్లింది. ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకోగా స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రమాద స్థలానికి ఫైర్ ఇంజన్ వెళ్లలేకపోవడంతో గుడిసె అప్పటికే పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న దంపతులు కాలిన గుడిసెను చూసి బోరున విలపించారు. ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు. గుడిసెలోని వస్తువులతోపాటు రూ.లక్షయాభై వేల నగదు కాలిబూడిదైంది. పిల్లలు పాఠశాలలో ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. ఆర్ఐ రాములు, రెవెన్యూ సిబ్బంది బాపుదేవ్ వివరాలు సేకరించారు.


ఆదర్శ పాఠశాలలో చోరీ

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి శివారు ఆదర్శ పాఠశాలలో చోరీ జరిగిందని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. పాఠశాలలో ఈ నెల 5న సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల సీసీపుటేజీలను మంగళవారం పరిశీలిస్తుండగా ఎటువంటి దృశ్యాలు కనిపించలేదు. కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రదేశాలు చూడగా కెమెరాలు లేవు. క్రీడా గదిని పరిశీలించగా క్రీడా పరికరాలతో పాటు గడియారాలు, దాదాపు రూ.పదిహేను వేల వరకు విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని ప్రిన్సిపాల్ పద్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ జీపీ పరిధిలోని తోకపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు గాయపడగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందగా, మృతికి కారణమైన వాహన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. కమలాపూర్ మండలం భీపంల్లికి చెందిన సముద్రాల కొంరయ్య వృత్తి రీత్యా సుతారి. బైక్‌పై వెళ్తుండగా ఓ కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు..



మాట్లాడుతున్న సంపత్‌రెడ్డి, తదితరులు

తిమ్మాపూర్: పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు రామకృష్ణ కాలనీకి చెందిన దావు సంపత్ రెడ్డి వినూత్నంగా ఆలోచించాడు. ఏ కార్యక్రమానికైనా పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులను వినియోగించొద్దని స్టీలు ప్లేట్లు, గ్లాసులను పెండోట అనంత చారి, ఎడ్ల భూమిరెడ్డితో కలిసి ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చాడు. వినియోగించినా అనంతరం శుభ్రం చేసి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్‌తో రోగాల బారినపడతామని ఆరోగ్య సంరక్షణకు వీటిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు.